క్లుప్తంగా

మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా దత్తు



వర్ని: జాకోర మత్స్య పారిశ్రామిక సంఘం నూతన అధ్యక్షుడిగా ఎర్రపల్లి దత్తును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో డైరెక్టర్లుగా శ్రీను, శంకర్, గంగాధర్, లక్ష్మణ్, దత్తు, నాగయ్య, గంగారాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరి, సర్పంచ్ గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపు శ్రీకాంత్

బాల్కొండ: దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గోపు శ్రీకాంత్‌ను నియమించారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సమావేశంలో నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆర్మూర్‌టౌన్: మహిళలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ అయేషా అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. 136 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 10మంది మహిళలకు రక్త నమూనాలు సేకరించారు. ఉచితంగా మందులు అందజేశారు. పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది అనురాధ, విజయ, సౌందర్య, తదితరులు పాల్గొన్నారు,

మన ఊరు- మన బడి పనుల పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్, మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులను డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పూర్తి చేసిన పనుల ఫొటోలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. ఎంఈవో రాజ గంగారాం, నోడల్ అధికారి వెంకట నర్సయ్య, ఏఈ రఘు, అనసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్ జయంతి



బోధన్: మేవార్ రాజు మహారాణా ప్రతాప్ సింగ్ జయంతిని మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గల మున్సిపల్ కాంప్లెక్స్‌లో స్థానిక సాయి ఆదర్శ యువతి మండలి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతాప్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గొప్ప దేశ భక్తుడని వారు కొనియాడారు. సాయి ఆదర్శ యువతి మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, మెప్మా పీఆర్‌పీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

బోధన్: రెండు రోజుల క్రితం పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడు దీపక్ తేజ(12) కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాడుతోందని వైఎస్‌ఆర్‌టీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సత్యవతి మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే షకీల్ అనుచరులు అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరైంది కాదని తెలిపారు.

రాజ్యాంగ పుస్తకాన్ని అందించాలి

బాల్కొండ: దేశంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగాన్ని ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బాల్కొండ తహసీల్దార్ వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగంపై అవగాహన ఉండాలన్నారు.

వార్డు సభ్యురాలి రాజీనామా

నందిపేట్(ఆర్మూర్): తల్వేద గ్రామానికి చెందిన 8వ వార్డు సభ్యురాలు ఆర్నపల్లి లత మంగళవారం వార్డు సభ్యురాలి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మండల పంచాయతీ అధికారి కిరణ్‌కుమార్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు. సర్పంచు, ఉప సర్పంచుల ఏకపక్ష నిర్ణయాల వల్ల పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

మొబైల్ ఫోన్ల రికవరీ

వర్ని/బాల్కొండ: వర్ని మండలం సేవాలాల్ తండాకు చెందిన బానోత్ సంతోష్, బాల్కొండ మండల కేంద్రానికి చెందిన పుట్టి జగదీశ్‌లు గతంలో ఫోన్లు పోగొట్టుకున్నారు. పోలీసులు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ట్రాక్ చేసి వారి మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. మంగళవారం వారి ఫోన్లను పోలీసులు అందించారు. వర్ని ఎస్సై, అనిల్ రెడ్డి, బాల్కొండ ఎస్సై గోపిలు సిబ్బందిని అభినందించారు.

వీరు నాటుడు.. వారు నరుకుడు!

- రోడ్డు పక్కన ఉన్న అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల నరికివేత
- విద్యుత్ తీగలకు అడ్డు రావడంతో తొలగింపు



మొదలుకు నరికిన చెట్లు



కొత్తపల్లి, ముప్కాల్ మధ్య బీటీ రోడ్డు పక్కన నరికిన చెట్లు

బాల్కొండ: రోడ్డు పక్కన అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఈజీఎస్ కూలీలతో పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలను నాటి పెంచుతున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతోందని ట్రాన్స్‌కో అధికారులు నరికి వేస్తున్నారు. దీంతో మొక్కను నాటి చెట్టుగా పెంచటానికి అయ్యే ఖర్చు వృథాగా పోతోంది. మొక్కలు నాటే ముందే సరైన స్థలాన్ని ఎంపిక చేసుకుని నాటితే ఇప్పుడు నరికి వేసే అవసరం ఉండేది కాదు. కాని అధికారులు తమ టార్గెట్ల కోసం ఇష్టారీతిన మొక్కలు నాటి చేతులు దులుపుకుంటున్నారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సరైన స్థలాన్ని ఎంపిక చేసుకుని మొక్కలను నాటాలని పలువురు కోరుతున్నారు.

అదును దొరికిందని..

విద్యుత్ తీగలకు ఇబ్బందికరంగా ఉన్నాయంటూ ట్రాన్స్‌కో అధికారులు కొమ్మలను నరకటానికి ప్రయత్నిస్తున్నారు. అదును దొరికిందని కదా అని రోడ్డు పక్కన పంట భూములున్న రైతులు మొదలునే నరికి వేస్తున్నారు. దీంతో చెట్లు మొత్తం మోడు బారి పోతున్నాయి. మొదటికి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మొక్క దశలో ఉన్నప్పుడు మేకలు, గేదేలు మేస్తే యజమానులకు కనీసం రూ.2 వేలు జరిమానా విధించాలన్న అధికారులు, ప్రస్తుతం చెట్లనే నరికి వేస్తే ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రి కళాశాల అధ్యాపక బృందం



విద్యార్థులను అభినందిస్తున్న క్షత్రియ కళాశాల యాజమాన్యం

ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంతో పాటు రెండో సంవత్సరం ఫలితాలను అధికారులు ఒకేసారి విడుదల చేశారు. బోధన్ పట్టణంలోని ఉషోదయ, విజయ సాయి, విజేత, విద్యావికాస్ జూనియర్ కళాశాలలు మంచి ఉత్తీర్ణత శాతం సాధించి బోధన్ సత్తా చాటాయి. ఆర్మూర్ పట్టణంలోని సీవీరామన్, గాయత్రి, క్షత్రియ, నందిపేటలోని శ్రీసాయి, కమ్మర్‌పల్లిలోని శ్రీభాషిత కళాశాల విద్యార్థులు కూడా మంచి ప్రతిభ కనబరిచారు. **– సాక్షి నెట్‌వర్క్**



షేక్ ముబీర్ హుస్సేన్ ఎంపీసీ, 989, ఉషోదయ కాలేజీ, బోధన్



కె. అంకిత, ఎంపీసీ, 466 ఉషోదయ కాలేజీ, బోధన్



ఖుర్రాతుల్ అయీన్, బైపీసీ ఫస్టియర్ 433, ఉషోదయ కాలేజీ, బోధన్



డి. మాన్య ఎంపీసీ, 989, విజయ సాయి కాలేజీ



రిమ్షా బేగం బైపీసీ ,985, విజయసాయి కాలేజీ



కె. నరేందర్ ఎంపీసీ, 986, విజేత కాలేజీ



ఎం. నవీన్, బైపీసీ, 987, విజేత కాలేజీ



బి. అక్షయ, ఎంపీసీ, 987, విద్యా వికాస్ కాలేజీ



జి. కనిష్క, బైపీసీ, 969, విద్యా వికాస్ కాలేజీ



మేఘన, ఎంపీసీ, 984, శ్రీసాయి కాలేజీ, నందిపేట

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల హవా



శ్రీనిత్య, హెచ్‌ఈసీ, 967, ఆర్మూర్



మూత అమూల్య, ఎంపీసీ, 990, భీమ్‌గల్



నిచ్చమొల్ల సౌమ్య, బైపీసీ, 989, భీమ్‌గల్



మేదస్వి, ఎంపీసీ, 970, మోడల్ స్కూల్, పెర్కిట్

ఇంటర్ ఫలితాల్లో బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 54 శాతం, కోటగిరి మైనార్టీ జూనియర్ కళాశాల 100 శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాల 90 శాతం, వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 21 శాతం, అమ్దాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ కళాశాల 50 శాతం, నవీపేటలోని తెలంగాణ ఆదర్శ కళాశాలలో 35 శాతం, నవోదయ కళాశాలలో 25 శాతం, మాక్లూర్‌లోని కేజీబీవీ విద్యార్థులు 100 శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 50 శాతం, సెకండ్ ఇయర్‌లో 80 శాతం, ఎడపల్లిలో గురుకుల కళాశాలలో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణ సాధించారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శ్రీనిత్య హెచ్‌ఈసీలో 967/1000లో సాధించి రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్ బేగం తెలిపారు. భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మూత అమూల్య(ఎంపీసీ), నిచ్చమొల్ల సౌమ్య(బైపీసీ) ఉత్తమ మార్కులు సాధించారు.

వంటా వార్పుతో వీవోఏల నిరసన

జిల్లా వ్యాప్తంగా ఐకేపీ వీవోఏలు మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. మండల కేంద్రాల్లో వంటావార్పు చేసి తమ నిరసనను ప్రదర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు వీవోఏలు 16 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం విదితమే. సమ్మెకు వివిధ పార్టీల నేతలు మద్దతు తెలిపారు. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని నేతలు వ్యాఖ్యానించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆపబోమని వీవోఏలు స్పష్టం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రుద్రూర్‌లో వంటా వార్పుతో నిరసన తెలుపుతున్న వీవోఏలు..పక్కన కాంగ్రెస్ నాయకులు



ముప్కాల్ మండల కేంద్రంలో..



బోధన్‌లో..

నెల రోజుల్లో గొర్రెలను అందిస్తాం



మాక్లూర్: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా కుర్మ, గొల్లలకు నెల రోజుల్లో గొర్రెలను అందించే ప్రణాళిక వేగంగా జరుగుతుందని పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి వెల్లడించారు. మంగళవారం ముత్యంపల్లిలో మండల పశుసంవర్ధక శాఖ నిర్వహించిన అవగాహన సదస్సుకు జేడీఏ జగన్నాథచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీడీలు చెల్లించని వారు తక్షణమే చెల్లిస్తే నెల రోజుల్లో గొర్రెలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యులు కిరణ్ దేశ్‌పాండే, ఉమామహేర్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బడుగు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలులో రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు

బోధన్‌రూరల్(బోధన్): వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు రానివ్వద్దని, సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవతో ధాన్యం సేకరణ పూర్తయ్యేలా చూడాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని కల్దుర్కి, సాలూర సొసైటీల్లో వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే సేకరించి రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు ఆర్డీవో రాజేశ్వర్ కలిసి తమకు నష్ట పరిహారం త్వరగా అందేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్లు వర ప్రసాద్, మమత, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.



సాలూరలో తడిసిన ధాన్యాన్ని, పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

ఆలయ స్థలం గ్రామస్తులకే చెందాలి

వేల్పూర్: రామన్నపేట్‌లో గ్రామదేవతలు వెలసిన స్థలం గ్రామస్తులందరికి చెందాలని, ఒక వర్గానికే చెందాలనడం సరికాదని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రామన్నపేట్ గ్రామస్తులతో ఆర్మూర్ డివిజన్‌స్థాయి అధికారులు చర్చలు జరిపారు. రామన్నపేట్ గ్రామంలోని ముదిరాజ్ వర్గీయులు తమపై అకారణంగా కేసులు నమోదు చేసారని ఆరోపిస్తూ గ్రామంలోని ఇతర వర్గాల వారు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి ఆందోళన నిర్వహించారు. దీంతో ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేందర్, భీమ్‌గల్ ఇన్‌చార్జి సీఐ గోవర్ధన్‌రెడ్డి, మోర్తాడ్, వేల్పూర్ ఎస్సైలు రాజు, వినయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో చర్చలు నిర్వహించారు. కేవలం గ్రామస్తులే రావాలని అధికారులు పేర్కొనడంతో ముదిరాజ్‌లు చర్చల్లో పాల్గొనలేదు. దీంతో అధికారులు గ్రామస్తులతో చర్చలు జరిపారు. గ్రామ దేవతలు ప్రతిష్ఠించిన స్థలం ప్రభుత్వ స్థలమని, గ్రామస్తులంతా పూజలు జరుపుకోడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. గ్రామ దేవతలున్న స్థలం గ్రామస్తులందరికీ చెందాలని, లేదంటే ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని స్పష్టం చేశారు. కేవలం ముదిరాజ్ వర్గానికే చెందాలంటే ఒప్పుకునేది లేదని గ్రామస్తులు అధికారులకు తెలిపారు.

యువకుల చైతన్యం మార్పునకు నాంది

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న కుకునూర్ యువకులు

వేల్పూర్: సీఎం కేసీఆర్ జనరంజక పరిపాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కుకునూర్ యువకులు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరడం మార్పునకు నాంది పలుకుతుందని ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. కుకునూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన యువకులు మంగళవారం హైదరాబాద్‌లో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ వల్ల దేశంలో వైషమ్యాలు తప్ప అభివృద్ధి లేదనే విషయాన్ని యువకులు మెల్లమెల్లగా గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు అమ్ముతూ, అన్ని రకాల ధరలు పెంచుతూ సామాన్యులను అరిగోస పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మారగంగారెడ్డి, డాక్టర్ మధుశేఖర్, వేల్పూర్ మండల వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన రెంజర్ల రజిత బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం సోమవారం చేరారు. విషయం తెలుసుకున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిమ్స్ డైరెక్టర్‌కు ఫోనులో మాట్లాడి వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు. అంతే కాకుండ ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల ఎల్‌వోసీని అందించారు. నాయకులు మచ్చర్ల రాజారెడ్డి, నవీన్‌గౌడ్, గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే కొనుగోళ్లు ఆగాయి



నవీపేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ధాన్యం కొనుగోలు నిలిచాయని బీజేవైఎం జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశాక రైస్ మిల్లర్లకు నష్టం వాటిల్లితే ఆదుకుంటామనే భరోసా సీఎం ఇవ్వలేదన్నారు. దీనిపై సరైన అవగాహన లేని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బీజేపీకి చెందిన రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధి మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని చూడని ఎమ్మెల్యే తన తీరును మార్చుకోవాలన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నవీపేట: తడిసిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ సింగ్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో తడిసిన ధాన్యం రాశులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇంకా 70 శాతం ధాన్యం కల్లాల్లోనే ఉన్నాయని తెలిపారు. నాయకులు కిషన్, రాము పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు అంబేడ్కర్‌కు వినతి



మాక్లూర్: అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న కారోబార్లు, సిబ్బంది



నందిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం..

మాక్లూర్/నందిపేట : తమ సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ పంచాయతీ సిబ్బంది ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం పంచాయతీ కారోబార్లు, సిబ్బంది కలిసి ర్యాలీగా బయలుదేరి స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, పారిశుధ్య సిబ్బందికి రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి, జీపీల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వ ఖజానా నుంచే వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

మురికి కాలువలు శుభ్రం చేసిన సర్పంచ్

నవీపేట: మోకన్‌పల్లి సర్పంచ్ రొద్ద సుధాకర్ మంగళవారం గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేశారు. గ్రామానికి చెందిన పుర్రె గంగాధర్ ఇంట్లో బుధవారం శుభకార్యం జరుగనుంది. జీపీ పారిశుధ్య కార్మికులు కొన్ని రోజులుగా సమ్మెలో ఉండడంతో గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో గ్రామంలోని అన్ని ప్రాంతాలలో చెత్తాచెదారం పేరుకుపోయింది. సమ్మెలో ఉండడంతో మురికి కాలువలను శుభ్రం చేసేందుకు పంచాయతీ కార్మికులు ససేమిరా అన్నారు. దీంతో సర్పంచ్ శుభ్రం చేసి శభాష్ అనిపించుకున్నారు.



చిక్కడపల్లి సర్పంచ్ బీఆర్‌ఎస్‌లో చేరిక



రుద్రూర్: చిక్కడపల్లి గ్రామ సర్పంచ్ పుష్పలత సోమవారం రాత్రి బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మద్దతురాలిగా ఉన్న సర్పంచ్ కొన్ని నెలలుగా అధికార పార్టీలో చేరడానికి సన్నాహాలు చేశారు. అయితే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మోకాలడ్డు వేయడంతో బ్రేక్ పడింది. ఎట్టకేలకు బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

సమాచారం..

15 నుంచి చీఫ్ మినిస్టర్ కప్ ఆటల పోటీలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈనెల 15 నుంచి 17 వరకు చీఫ్ మినిస్టర్ కప్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గౌతమి తెలిపారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆమె అధ్యక్షతన క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలతో పాటు, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కో ఈవెంట్ నుంచి ఒక్కో టీం మాత్రమే పాల్గొనాలని సూచించారు. 16–36 ఏళ్ల లోపు పురుషులు, మహిళలు పాల్గొనవచ్చని తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొనేవారు మండల పరిషత్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.